క్లుప్తంగా

పాఠశాలలకు క్రీడా సామగ్రి వితరణ



ఉపాధ్యాయులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

సబ్బవరం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సబ్బవరంలోని కెనరా బ్యాంకు సామాజిక బాధ్యత(సిఎస్ఆర్)లో భాగంగా క్రీడా సామగ్రి కిట్‌లు సమకూర్చింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, బ్యాంకు సీనియర్ మేనేజర్ నుపూర్ చౌదరి వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు కిట్లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధా కుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



అనిల్‌కుమార్

పెందుర్తి: పెందుర్తి బీసీ కాలనీలో నివాసం ఉంటున్న ఓ ఇంటర్ విద్యార్థి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి.. బీసీ కాలనీలో ఉంటున్న శోబా అనిల్ కుమార్ నగరంలోని ప్రైవేటు కళాశాల లో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 6న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన లభించింది. 25 మంది కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. రక్తదానం వల్ల ఎన్నో ప్రాణాలను నిలబెట్టినవారవుతారని కరస్పాండెంట్ థియోపిలాస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా, వైస్ ప్రిన్సిపాల్ ఏ.డీ.కె రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: నిర్వహణ పనుల నిమిత్తం పెందుర్తి పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వీరభద్రనగర్, ప్రశాంతి నగర్, బీసీ కాలనీ, శ్రీప్రకాష పాఠశాల ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాతీయ బాలల ఉత్సవానికి 'ఎస్ఎఫ్ఎస్' విద్యార్థులు



విద్యార్థులతో స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ మనోజ్

సీతమ్మధార: కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి మూడు రోజుల పాటు న్యూఢిల్లీలో జరిగే జాతీయ బాలల ఉత్సవానికి సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ మనోజ్ మాట్లాడుతూ బాలభవన్ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన బి.పూజిత చందన, వి.కమలిని శ్రీ వర్ష, బి.అనురాధ పాల్గొంటున్నట్లు చెప్పారు. నృత్య దర్శకుడు నాగరాజు పట్నాయక్ మాట్లాడుతూ దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన 180 మంది బాల కళాకారులు ఎంపికయ్యారని తెలిపారు. ఎస్ఎఫ్ఎస్ విద్యార్థులు 17న జాతీయ సమైక్యతను చాటిచెప్పే నృత్యం, 18న బెంగాలీ జానపద నృత్యంను ప్రదర్శిస్తారని చెప్పారు. ఎంపికైన బాలలను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ప్రొఫెసర్ కె.వి.రమణ అభినందించారు.

సంక్షేమంతో పేదలకు ఆర్థిక భరోసా



ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పరవాడ: సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. పరవాడ బీసీ కాలనీలో శుక్రవారం రెండో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అధికారులు, పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వారితో మాట్లాడి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించడానికి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతకముందు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించి డిజిటల్ బోర్డును ప్రారంభించారు. అనంతరం బీసీ కాలనీలో గ్రామ ఉప సర్పంచ్ బండారు రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రసంగించారు. రాష్ట్రంలో పేద ప్రజలకు ఆర్థిక భరోసాకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే కారణమని చెప్పారు.

అర్హతే ప్రామాణికం

వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ఏర్పాటు చేసి పార్టీలు, వర్గాలు, కులమతాలకు అతీతంగా ప్రజల ముంగిటకు పథకాలు అందిస్తున్నారన్నారు. జగన్ హయాంలో ప్రజలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ఆనందంగా ఉన్నారని వివరించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత కల్పించి, నాడు- నేడు ద్వారా పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పాదయాత్రలో ప్రజలకిచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించుకొన్నారన్నారు. దీంతో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుతున్నారని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. బహిరంగ సభలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, బి.నాగేశ్వరరావు, వెన్నలపాలెం సర్పంచ్ వి.అప్పారావు, పార్టీ నాయకులు పైల అప్పలనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, పెదిశెట్టి శేఖర్, కె.భాస్కర్, సిరపరపు అయ్యబాబు, పైల సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: సంక్షేమ పథకాల అమల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని ఆరిపాక సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే', పల్లెకు పోదాం కార్యక్రమాల్లో ఆమె ముఖ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నవారిని పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా గుర్తించి సంక్షేమ పథకాలు చేరువచేయడం జరుతుందన్నారు.మహిళా సాధికారత కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దేశ చరిత్రలో నే ఇటువంటి అభివృద్ధి,సంక్షేమం అందించిన ప్రభుత్వాలను చూడలేదన్నారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సుమారు రూ.29 కోట్లతో సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కుల,మత,ప్రాంత,పార్టీలకు అతీతంగా నేరుగా వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్లకే అందించడం జరుగుతుందన్నారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేస్తున్న జగనే మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని,అందుకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, వైస్ ఎంపీపీ దాడి రూనీస్ లక్ష్మిరాణి, ఎంపీడీవో రమేష్ నాయుడు, నాయకులు కొటాన రాము, సబ్బవరపు ముత్యాల నాయుడు, కర్రిబాబు, బోకం రామునాయుడు,శరగడం రాము,సబ్బవరపు నారాయణమూర్తి, బొడ్డేటి మహలక్ష్మినాయుడు, మళ్ల కోటేశ్వరరావు,ఉప సర్పంచ్ శ్రీనివాసరావు,ఎస్పీ రాజు,బండారు రమణ,ఐడీ బాబు, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గడపకు జగన్ అండ



చింతగట్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న అజయ్‌రాజ్

పెందుర్తి: ప్రతీ గడపకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని..రానున్న ఎన్నికల్లో ప్రతీ ఇంటిపై వైఎస్సార్ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ అన్నారు. సీఎం వైఎస్ జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రతీ ఇంటికి మేలు జరిందన్నారు. పెందుర్తి మండలం చింతగట్ల పంచాయతీలో 'వై నీడ్స్ ఏపీ జగన్' కార్యక్రమాన్ని రెండోరోజు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అజయ్‌రాజ్ మాట్లాడు తూ సంక్షేమ పాలనతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైఎస్ జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రతీ ఒక్కరూ సంక్షేమ పాలన సాగాలని.. రాష్ట్రానికి మళ్లీ జగనే కావాలని ఆకాంక్షిస్తున్నారని వెల్లడించారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, వైస్ ఎంపీపీ చిరికి దేముడు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి, పార్టీ నేతలు మధుపాడ అంజి, కోన శ్రీనివాసరావు, గొంప అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

వైద్య సిబ్బందికి ఎంపీడీవో రమేష్‌నాయుడు ఆదేశం

సబ్బవరం: ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టంగా నిర్వహించాలని ఎంపీడీవో రమేష్ నాయుడు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ప్రభుత్వ ఆస్పత్రుల ఆరోగ్య కార్యకర్తలతో శుక్రవారం ఈ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న సుమారు 90 మందిని ప్రత్యేక చికిత్స కోసం రిఫర్ చేయడం జరిగిందన్నారు. వలంటీర్ల సహకారంతో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై సర్వే చేసి తగిన మందులు సిఫార్సు చేయడం లేదా ఆస్పత్రులకు తరలించడం లాంటివి చేయాలనిఆదేశించారు. ఈ విషయంలో గ్రామ వలంటీర్లు సహకరించకపోయినా తనకు ఫిర్యాదు చేయాలని కోరారు. అంతే కాకుండా ప్రతి కుటుంబానికి ఆరోగ్య సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రచారం నిర్వహించాలని, కుటుంబ సభ్యులు నిరక్షరాస్యులు అయితే ఆ యాప్ ను ఆరోగ్య కార్యకర్తలే వారి ఫోన్లలో డౌన్‌లోడ్ చేసి ఇవ్వాలని రమేష్ నాయుడు ఆదేశించారు. సమావేశంలో ఏవో షేక్ బాబూరావు, ఈవోఆర్డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అలాగే స్వామికి సహస్ర నామార్చన ఘనంగా నిర్వహించారు.1001 నామాలతో స్వామికి అర్చన చేశారు.

డస్ట్ అలవెన్స్ చెల్లించాలి



గేటు మీటింగ్‌లో మాట్లాడుతున్న కార్మిక నాయకుడు అప్పలనాయుడు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో పని చేస్తున్న కార్మికులకు చెల్లించాల్సిన డస్ట్ అలవెన్స్ అగ్రిమెంట్ జరిగి మూడు నెలలు కావస్తున్నా అమలుకు నోచుకోకపోవడం దురదృష్టకరమని కార్మిక నాయకుడు మాసవరపు అప్పలనాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ దుయ్యబట్టారు. సింహాద్రి ఎన్టీపీసీ ఎదుట శుక్రవారం నిర్వహించిన గేటు మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఎన్టీపీసీ యాజమాన్యం కార్మికుల చట్టాలు, హక్కులను హరిస్తుందన్నారు. కార్మికులందరికి ఎన్టీపీసీ లోగో తో కూడిన గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అగ్రిమెంటు అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. లేబరు అధికారులు, ఎన్టీపీసీ అధికారుల సమక్షంలో జరిగిన అగ్రిమెంటుకు అతీగతీ లేకపోతే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నించారు. యాజమాన్యం స్పందించే వరకు ప్రతీ రోజు ఆందోళన చేయాలని సమావేశం తీర్మానించింది. కార్మిక నాయకుడు ఆర్.ఆర్.నాయుడు, వివిధ కార్మిక సంఘాల నాయకులు బంగారుబాబు, అలీ, నంబారు రమణ, ఎస్.దేముడు, ఎం.శ్రీను, సీఐటీయూ ప్రతినిధి పి.గోవిందరాజన్ తదితరులు పాల్గొన్నారు.

కాశీ రైలు కంచికేనా..?

- అట్టహాసంగా ప్రారంభించారు.. పొడిగింపు మరిచారు
- ఇప్పటికీ పట్టాలెక్కని మరో రైలు



ఏప్రిల్‌లో ప్రారంభించిన కాశీ వీక్లీ స్పెషల్ ట్రైన్ (ఫైల్)

తాటిచెట్లపాలెం: ఈ ఏడాది ఏప్రిల్ వరకు కాశీకి రైలు లేదని ఉత్తరాంధ్ర వాసులు బాధపడేవారు. ఎట్టకేలకు ఏప్రిల్‌లో కాశీకి వీక్లీ స్పెషల్ రైలు మంజూరై పట్టాలెక్కింది. విశాఖపట్నం-బనారస్-విశాఖపట్నం(08588/08587) వీక్లీ స్పెషల్ రైలుగా విశాఖ నుంచి ప్రతీ బుధవారం బయలుదేరేది. అది కాస్తా వివిధ కారణాలతో మధ్యలో కొన్ని రోజులు నడిచేది, కొన్ని రోజులు రద్దయ్యేది. ఇది ప్రత్యేక రైలు కావడంతో దీని కాలపరిమితి అక్టోబర్ 26తో ముగియడంతో పూర్తిగా నడవడం లేదు. ప్రస్తుతం కాశీ రైలు లేదు. ఇప్పటివరకు పొడిగింపు రాలేదు. భవిష్యత్తులో ఈ ట్రైన్ ఉంటుందా.. ఉండదా అని ప్రయాణికుల్లో, ఉత్తరాంధ్ర వాసుల్లో ఒకటే ఆందోళన. ఈ రైలు ద్వారా డైరెక్టుగా కాశీకి చేరుకునే ప్రయాణికులు ఎంతో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని సాగించేవారు. ఇది కాస్తా లేకపోవడంతో మళ్లీ పాత కష్టాలు మొదలయ్యాయి.

ఇలాగే మరో రైలు కథ..

వారణాసి-సంబల్‌పూర్-వారణాసి(18312/18311) రైలును విశాఖపట్నం వరకు పొడిగిస్తున్నట్లు స్వయానా రైల్వే మంత్రి సెప్టెంబర్ 25న ప్రకటించడం, ఆయనకు జేజేలు పలకడం జరిగాయి ఈ ప్రకటన చేసి సుమారు నెలన్నర కావస్తున్నా.. దీనిపై ఎటువంటి చర్యలు లేవు. ఇది ఎప్పుడు పట్టాలెక్కుతుందో.. విశాఖ వాసులు ఆశలు తీరేదెప్పుడో తెలియని పరిస్థితి. విశాఖపట్నం నుంచి వారణాసికి రెండు రైళ్లని మురిసిపోయాం. కానీ ఆ ఆనందం కేవలం కొద్ది రోజుల్లోనే ఆవిరైంది. సంబంధిత అధికారులు స్పందించి విశాఖ నుంచి నడిచే వీక్లీ స్పెషల్ రైలును కొనసాగించాలని, సంబల్‌పూర్ రైలును కూడా విశాఖ వరకు పొడిగించి వెంటనే పట్టాలెక్కేలా చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర, విశాఖ వాసులు కోరుతున్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తరించాలి



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

మహారాణిపేట: స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల సేవలు దశ దిశలా విస్తరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. భారత్ స్కౌట్స్, గైడ్స్ జాతీయ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జేసీ చాంబర్‌లో ఆయనను విద్యార్థులు కలిసి ఆవిర్భావ బ్యాడ్జిలను జేబుకు అతికించి అభినందనలు తెలిపారు. ఈ విభాగంలో ఈ ఏడాది ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ విద్యతో పాటు స్కౌట్స్, గైడ్స్ లక్ష్యాలు, ఆశయాలు చేరువయ్యేందుకు ప్రతి విద్యార్థి ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. 1950, నవంబర్ 7న ఈ సంస్థ ఆవిర్భవించిందన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ క్రమ శిక్షణ, అకుంఠిత దీక్షకు మారు పేరైన స్కౌట్స్, గైడ్స్ రంగంపై విద్యార్థులను ప్రభావితం చేయాల్సిన గురుతర బాధ్యత తల్లిదండ్రులు, సమాజంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ యూత్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.హరీష్‌కుమార్, ఏఎస్‌వో షరీఫ్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం విశాఖ జిల్లా కన్వీనర్ కె.ఎల్లయ్య, గైడ్ కెప్టెన్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మూడో అంతస్తుపై నుంచి పడి వ్యక్తి దుర్మరణం

మద్యం మత్తులో ఘటన

ఎంవీపీకాలనీ: మూడో అంతస్తుపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం ఎంవీపీకాలనీలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పక్కి గ్రామానికి చెందిన సంబంగి నాగభూషణం(58) విశాఖలో ఉంటూ పలుచోట్ల సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తించాడు. చివరగా ఎంవీపీ కాలనీ సెక్టార్-4లోని అమ్మ బాయ్స్ హాస్టల్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేశాడు. మద్యం సేవిస్తుండటంతో పాటు ప్రవర్తన బాగోలేదని హాస్టల్ నిర్వాహకులు గతంలో ఆయన్ని విధుల నుంచి తొలగించారు. దీంతో గత నెల 10న నాగభూషణం సొంతూరు వెళ్లిపోయాడు. కాగా.. నాగభూషణం తన తండ్రిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఎంవీపీకాలనీలోని క్యాన్సర్ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో ఆయన గతంలో తాను పనిచేసిన అమ్మ బాయ్స్ హాస్టల్‌కు శుక్రవారం మధ్యాహ్నం 12.30 సమయంలో వెళ్లాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్నాడు. 3వ అంతస్తులో ఐరన్ రైలింగ్‌కు ఆనుకుని నిల్చొన్నాడు. ప్రమాదవశాత్తూ రైలింగ్ విరిగిపోవడంతో కింద పడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ సంజీవరావు, ఎస్ఐ శ్రీను అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి అన్నయ్య తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలి

ఐఐఎం సంచాలకుడు ఆచార్య చంద్రశేఖర్



ప్రసంగిస్తున్న ఆచార్య చంద్రశేఖర్

ఏయూక్యాంపస్: సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా యువత ఎదగాలని ఐఐఎం- విశాఖపట్నం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబి) బీబీఏ-ఎంబీఏ తరగతుల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృజనాత్మకంగా ఆలోచన చేసే యువతలో ఉద్భవించే ఆలోచనలను ఆచరణలో పెట్టే వ్యవస్థ ఏయూలో అందుబాటులో ఉందన్నారు. ఏయూలో నెలకొల్పిన ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం నూతన బ్యాచ్‌లో 35 దేశాలకు చెందిన విద్యార్థులు ప్రవేశం పొందారన్నారు. వచ్చే ఏడాది నుంచి ఎంబీఏ- హెచ్.ఆర్ కోర్సును సైతం ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఏయూ సిబ్‌ని స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా మార్పు చేస్తామన్నారు. విహాన్ ఎలక్ట్రానిక్స్ సీఈఓ ఎస్‌వెంకట రెడ్డి మాట్లాడుతూ లీడర్‌షిప్, టెక్నాలజీ, ఎంటర్‌ప్యూనర్‌షిప్ భవిష్యత్‌ను నిర్ణయిస్తాయన్నారు. ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ సారబంది, ఏయూ సిబ్ ఆచార్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థునుల స్వాగత నృత్యం అలరించింది.

సెమీస్‌కు బాలప్రణయ్, అపర్ణ


ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



క్వార్టర్ ఫైనల్స్ పోటీల్లో తలపడుతున్న షట్లర్లు

విశాఖ స్పోర్ట్స్: 67వ రాష్ట్ర అంతర్ జిల్లాల ఎస్జీఎఫ్ బ్యాడ్మింటన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖ షట్లర్లు బాలప్రణయ్, అపర్ణ సెమీస్‌కు చేరుకున్నారు. అండర్-14 కేటగిరీలో బాలుర విభాగంలో చిత్తూరుకు చెందిన వేదవ్యాస్, బాలికల విభాగంలో అనంతపురానికి చెందిన నక్షత్ర సెమీస్‌లో ప్రవేశించారు. ఇక్కడి స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన వ్యక్తిగత పోటీల్లో సత్తా చాటారు. ఎస్జీఎఫ్ విశాఖ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన అండర్-14, 17 బాల బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అండర్ 14 బాలుర విభాగంలో జి.ఎస్.వేదవ్యాస్(చిత్తూరు), ఎస్.మురారివెంకట్(అనంతపురం), కె.ఈశ్వరసాయి(అనంతపురం), ఎం.కృష్ణకార్తీక్(తూర్పుగోదావరి) సెమీస్‌కు చేరుకున్నారు. బాలికల విభాగంలో జె.నక్షత్ర, డి.యజ్ఞశ్రీ(అనంతపురం), డి.ఆశశ్రీ(ప్రకాశం), ఆర్.యశ్విత(కర్నూలు) సెమీస్‌లో ప్రవేశించారు. అండర్-17 బాలురలో పి.బాలప్రణయ్(విశాఖ), ఎ.త్రిలోక్(పశ్చిమ గోదావరి), కె.ఎస్ వెంకటప్రణీత్ (తూర్పుగోదావరి), టి.నిఖిల్ ప్రకాష్(కర్నూలు, బాలికల్లో అపర్ణ(విశాఖ), ఎస్.సౌమ్యశ్రీ(తూర్పుగోదావరి), సీహెచ్ భవితశ్రీ(పశ్చిమగోదావరి), బి.హర్షిత(విశాఖ) సెమీస్‌లోకి దూసుకెళ్లారు.

ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం



1002వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు తమ జీవితాల కోసం చేస్తున్న పోరాటం ప్రతీ ఒక్కరిని కదిలిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. సంఘటితంగా పోరాడి, పరిశ్రమను రక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 1002వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని పదే పదే ప్రకటనలు చేయడం సరికాదన్నారు. పోరాటం చేయడం ఇక్కడి ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సదస్సుకు సహకరించాలని వినతి



సీఎండీ అతుల్ భట్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23న తలపెట్టిన సదస్సుకు ఉక్కు యాజమాన్యం సహకరించాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. ఎస్సీ, ఎస్టీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బయ్యే మల్లయ్య, బి.తాడన్న, ఓబీసీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌ను శుక్రవారం కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ తెన్నేటి ఆడిటోరియంలో ఆ రోజు మధ్యాహ్నం 3గంటల నుంచి 5.30 వరకు 'ప్రభుత్వ రంగ సంస్థలు - రిజర్వేషన్లు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, రాష్ట్ర అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ గొల్ల బాబూరావు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, రాష్ట్ర ఉద్యోగుల ఫెడరేషన్ సలహాదారు ఆళ్ల వెంకటేశ్వర్లు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ తదితరులు హాజరవుతున్నారని తెలియజేశారు. ఆడిటోరియంతో పాటు అతిథుల వసతికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.